## క్లుప్తంగా

### మీసాల వెంకన్నకు ప్రత్యేక పూజలు



యండమూరులోని మీసాల వెంకటేశ్వరస్వామి

కరప: మండలం యండమూరులో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ధనుర్మాసం సందర్భంగా వంశ పారంపర్య అర్చకులు పెద్దింటి సీతా రామం స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మీసాల వెంకటేశ్వరస్వామిగా పిలిచే స్వామి వారిని దర్శించి, ఏడువారాలు, ఏడు ప్రదక్షిణలు చేసి మొక్కుకుంటే కోరిన కోర్కెలు తీరతాయని అర్చకుడు సీతారామం తెలిపారు. శనివారం స్వామివారిని దర్శించుకోవడానికి పరిసర గ్రామాల నుంచి కాలినడకన వచ్చిన భక్తులు, భవానీలు స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. భక్తులు ఇచ్చిన విరాళాలతో కాలినడకన వచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ చేస్తున్నట్టు అర్చకుడు సీతారామం తెలిపారు.

### చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రశాంత శ్రీ

కాకినాడ రూరల్: అంతర్జాతీయ చిరు ధాన్యాల దినోత్సవాన్ని పురస్కరించుకుని అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటరులో ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్ర సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులు చిరుధాన్యాలపై శనివారం అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ప్రశాంత శ్రీ మాట్లాడుతూ చిరుధాన్యాలు భారతీయ సంస్కృతిలో ఒక భాగమన్నారు. ఆహార పదార్థాలు, చిరుధాన్యాలు ప్రస్తుత లైఫ్ స్టైల్‌లో మనందరమూ మరిచిపోయామని, వీటిని తినడం వలన మన పూర్వీకులు ఎంతో ఆరోగ్యవంతంగా దృఢంగా ఉండేవారన్నారు. అనంతరం చిరుధాన్యాలు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టరు ఎం.శ్రీదేవి, డాక్టరు కె.హరిబాబు, నెహ్రూ యువ కేంద్ర ప్రతినిధులు సత్తిబాబు, చంటిబాబు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు ధనుర్మాస ప్రసాద వితరణ

బోట్‌క్లబ్: వాసవీ వైశ్యా ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 నుంచి 10.30 వరకూ స్థానిక రాజాజీ వీధిలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో ధనుర్మాస ప్రసాద వితరణ జరుగుతుందని కన్వీనర్ చెక్కా రమేష్ శనివారం విలేకర్లకు తెలిపారు. తొమ్మిదేళ్లుగా ఏటా ధనుర్మాసంలో ప్రసాద వితరణ చేస్తున్నట్లు చెప్పారు.

### కొనసాగుతున్న సమ్మె

కరప: అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మండల పరిధిలోని అంగన్‌వాడీలు, ఆయాలు కరపలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద కాకినాడ రూరల్ ప్రాజెక్టు అధ్యక్షురాలు ఎం.వీ రవేణి, కరపప్రాజెక్టు నాయకురాలు ఎస్.వరలక్ష్మి, సీఐటీయు మండల నాయకులు బి.రాంప్రసాద్‌ల ఆధ్వర్యంలో నిరసన దీక్షలు చేపట్టారు. గ్రామకార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్‌కు, తర్వాత కాకినాడ వెళ్లి పార్లమెంట్ సభ్యురాలు వంగా గీతలకు తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు.

### వెబ్‌సైట్‌లో ప్రొవిజినల్ మెరిట్ జాబితా

కాకినాడ క్రైం: నేషనల్ హెల్త్ మిషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 8న విడుదల చేసిన ఉద్యోగ ప్రకటనకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాను ఆన్‌లైన్‌లో ఉంచారు. జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డాక్టర్ నరసింహ నాయక్ శనివారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఈస్ట్‌గోదావరి.ఏపీ.జీఓవీ.ఇన్, కాకినాడ.ఏపీ.జీఓవీ.ఇన్, కోనసీమ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లలో అభ్యర్థులు తమ వివరాలు సరిచూసుకోవాలని సూచించారు. అభ్యంతరాలుంటే జనవరి 1 నుంచి మూడో తేదీ వరకూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల మధ్య తన కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

### రైల్వే క్రాసింగ్‌ల పరిశీలన

పిఠాపురం: రైల్వే క్రాసింగ్‌ల వద్ద పరిస్థితులను విజయవాడ రైల్వే సెక్షన్ సీనియర్ ఇంజినీర్ టి.అప్పలరాజు ఆధ్వర్యంలో పలువురు అధికారులు పరిశీలించారు. రోడ్లు భవనాల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, నీటిపారుదల శాఖ, రెవెన్యూ, విద్యుత్ శాఖ తదితర శాఖల అధికారులు శనివారం గొల్లప్రోలు నగర రైల్వే పరిధిలో సూరంపేట, మల్లవరం రైల్వే గేట్ల వద్ద ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలపై సర్వే నిర్వహించారు. ఆయా ప్రదేశాల్లో వాహనాల రాకపోకలు పెరగడంతో పాటు ప్రజలు పడుతున్న ఇబ్బందులను విశ్లేషించారు. నివేదికలను ఉన్నతాధికారులకు అందజేస్తామని అవసరాలకు అనుగుణంగా ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు.

# ఇంటింటా పండగ శోభ

- ఎంపీ వంగా గీత
- వేడుకగా జగనన్న సంక్రాంతి సంబరాలు
- ముగ్గు వేసి మహిళలను ఉత్సాహపరచిన ఎంపీ



పోటీలను తిలకిస్తున్న ఎంపీ గీత, ఎమ్మెల్యేలు కన్నబాబు, ద్వారంపూడి

కాకినాడ సిటీ: జగనన్న సంక్రాంతి సంబరాలతో ప్రతి మహిళ ఇంటా పండుగ శోభ నెలకొందని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో కాకినాడలో జరుగుతున్న జగనన్న సంక్రాంతి సంబరాల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కురసాల కన్నబాబుతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్ పోటీల్లో ఆమె స్వయంగా పాల్గొని మహిళలను ఉత్సాహపరిచారు. అంతే కాకుండా స్వయంగా ముగ్గులు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ ఆనందంగా సంతోషంగా ఉన్నప్పుడే ఆ కుటుంబం సుఖ సంతోషాలతో మనగలుగుతుందన్నారు. అదే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పేరిట ఎన్నో పథకాలు అమలు చేస్తూ చేయూత నిస్తుంటే ఎమ్మెల్యే ద్వారంపూడి పండుగ ముందు నగరమంతా అక్కాచెల్లెళ్లలో ఉత్సాహం నింపేలా మంచి పోటీలు ఏర్పాటు చేశారన్నారు. కేవలం పోటీలే కాకుండా విజేతలకు ప్రయోజనకరమైన ఖరీదైన గృహోపకణాలను కూడా అందిస్తున్నారన్నారు. జగనన్న సంక్రాంతి సంబరాలతో నగరంలో ఎక్కడ చూసినా ప్రతి మహిళ ఇంట సంక్రాంతి శోభ కనిపిస్తోందన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు కన్నబాబు మాట్లాడుతూ మహిళలను చైతన్య పరిచేలా ఎమ్మెల్యే ద్వారంపూడి మంచి కార్యక్రమానికి రూపకల్పన చేశారన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ జనవరి పదో తేదీ వరకు ఈ పోటీలను కొనసాగించి నియోజకవర్గ స్థాయిలో ఫైనల్స్ నిర్వహిస్తామన్నారు. ఆయా క్లస్టర్లలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న ఎంపీ వంగా గీత

## న్యూ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ



రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో న్యూ ఇయర్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీ వంగా గీత

కాకినాడ రూరల్: మండలంలోని గంగనాపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు, మండల జేసీఎస్ కన్వీనర్ గీసాల శ్రీనివాసరావు ముద్రింపజేసిన న్యూ ఇయర్ క్యాలెండర్లను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత శనివారం ఆవిష్కరించారు. రమణయ్యపేట క్యాంపు కార్యాలయంలో వాటిని ఆవిష్కరించిన అనంతరం వారు ముందుగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, ఎంపీటీసీ వాసంవెట్టి సత్యవేణి, కురసాల కల్యాణ్‌కృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, కరీం బాషా, నేమాం సర్పంచ్ రామదేవు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

### జీవ వైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలి

బాలాజీచెరువు: జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నేషనల్ గ్రీన్ కోర్ రాష్ట్ర సంచాలకురాలు పి.స్రవంతి పేర్కొన్నారు. నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో నగరంలో ఉన్న వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల సందర్శనలో భాగంగా శనివారం విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ పచ్చదనం పెంచడం ద్వారా గ్లోబల్ వార్మింగ్ నివారణ సాధ్యమతుందన్నారు. గ్రీన్ ఎనర్జీ ఆవశ్యకత తెలియజేశారు. నగరంలో ఉన్న అక్షర, శ్రీ ప్రకాష్ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అర్బన్ డీఐ వాణికుమారి, నేషనల్ గ్రీన్ కోర్ కో–ఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

### ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ముగ్గుపేటలోని క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న యువకులు

కాకినాడ సిటీ: కాకినాడ జగన్నాథపురం ముగ్గుపేట పెద్దలు, యూత్ సభ్యుల ఆధ్వర్యంలో సెంటినరీ బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో క్రీస్తు పుట్టిన రోజు వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ సభ్యులు అడ్డాల వెంకటరమణ, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు దోకుబుర్ర భద్రం, ఎ.సుధాకర్, కేఎస్ఎన్ రెడ్డి, పి సుధాకరరావు, ఎస్.విజయకుమార్, కుందేటి మోజెస్‌కుమార్, పిట్ట సువర్ణ తదితరులు మాట్లాడుతూ క్రీస్తు గొప్పతనాన్ని, ప్రేమ తత్వాన్ని, త్యాగాలను కొనియాడారు. ముగ్గుపేట పెద్దలు ఆరుగుల సోమరాజు, సంఘ కాపరి ఎ.సుధాకర్‌రావులను సన్మానించారు. కార్యక్రమంలో వట్టూరి వీరన్న, తాతపూడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### రామావతారంలో సీతారామస్వామి



బోట్‌క్లబ్: స్థానిక మెయిన్‌రోడ్డులోని సీతారామస్వామి ఆలయంలో ధనుర్మాస వ్రత మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు రామావతారంలో భక్తులను దర్శనమిచ్చారు. స్వామికి ఆలయ ప్రధాన అర్చకులు భావవరపు భాస్కరాచార్యులు ఉదయం పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

## మానసికోల్లాసానికి క్రీడలు దోహదం



విద్యార్థులను పరిచయం చేసుకుంటున్న ముఖ్య అతిథి ఇన్‌చార్జి డీఎస్‌డీఓ సతీష్‌కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): విద్యార్థుల మానసికోల్లాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని డీఎస్ఏ ఇన్‌చార్జి డీఎస్‌డీఓ, వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ సతీష్‌కుమార్, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు రవిరాజు పేర్కొన్నారు. శనివారం స్థానిక జిల్లా క్రీడా మైదానంలో నారాయణ పాఠశాలల కాకినాడ డివిజన్ వార్షిక క్రీడా పోటీలు ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి విద్యా సంస్థల ఏజీఎం రాఘవేంద్రరావు అధ్యక్షత వహించగా, సతీష్‌కుమార్ ముఖ్య అతిథిగా, రవిరాజు విశిష్ట అతిథిగా విచ్చేశారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, బెలూన్లు వదిలి పోటీలను ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, రన్నింగ్, డాడ్జిబాల్ పోటీల్లో 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ బహుమతులు అందజేశారు. జోనల్ కో ఆర్డినేటర్ సంకర మూర్తి, కో–ఆర్డినేటర్లు ప్రియ, తులసి, హెచ్‌ఆర్ సుభద్ర, ఆర్‌ఎండీ పీఈటీ హెడ్ కమల్, ప్రిన్సిపాల్స్ కవిత, షర్మిల, రవికిశోర్, విఠల్ ఏఓ సతీష్, సాఫ్ట్ స్కిల్స్ పద్మలత, అకడమిక్ డీన్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులు

కాకినాడ సిటీ: భారత విద్యార్థి ఫెడరేషన్ 24వ రాష్ట్ర మహా సభలు విజయవంతం కావడంపై ఎస్ఎఫ్ఐ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా 55 మందితో రాష్ట్ర ఎస్ఎఫ్ఐ కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో జిల్లా నుంచి ఎం.గంగా సూరిబాబు, పి.వరహాలు, చిన్నిలను రాష్ట్ర కమిటీలో సభ్యులుగా ఎన్నుకున్నారు. రాష్ట్రస్థాయికి ఎన్నికైన వారిని జిల్లా ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు అభినందించారు.

**ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవం**

ఎస్ఎఫ్ఐ 54వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక కచేరిపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయం వద్ద నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్నకుమార్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. 54 ఏళ్లలో 279 మంది ప్రాణత్యాగం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.వరహాలు, ఎం.గంగాసూరిబాబు, రాష్ట్ర నాయకులు రవి, అక్బర్, అశోక్, గోపాల్, ఆదర్శ్, శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూ ఇయర్ వేడుకలకు సన్నద్ధం

- డీజే, సంగీత్ ఈవెంట్లతో హోరెత్తనున్న నగరం
- డిస్కౌంట్లు, ఆఫర్లు ప్రకటిస్తున్న సంస్థలు

బాలాజీచెరువు: మరికొన్ని గంటల్లో 2023వ సంవత్సరం ముగియనుంది. డిసెంబర్ 31వ తేదీన సందడి చేసేందుకు సర్వత్రా ఏర్పాట్లు చకచకా సాగిపోతున్నాయి. ఈ తేదీ వస్తే చాలు.. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ నూతనోత్సాహంతో ఆనందంగా గడిపి.. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతారు.

పైగా ఈ ఏడాది ఆదివారం అందరికీ సెలవు కావడంతో మరింత ఉత్సాహంగా నిర్వహించుకోవడానికి అవకాశం దొరకింది. కోవిడ్ నేపథ్యంలో 2020, 21 సంవత్సరాల్లో వేడుకలు నిర్వహించలేకపోగా గత ఏడాది అక్కడక్కడా నిర్వహించి మమ అనిపించారు. ఈ ఏడాది భారీ స్థాయిలో నిర్వహిస్తున్నారు.

పేరొందిన యాంకర్లతో పాటు సింగర్ కొండేపూటి యశస్వి వంటి వారితో వేడుకల నిర్వహణకు సిద్ధమవుతున్నారు. కాకినాడకు సమీపంలో చేబ్రోలు వద్ద భారీ స్థాయిలో కుటుంబ సభ్యులతో కలసి పాల్గొనేలా భారీ ఈవెంట్ నిర్వహిస్తున్నారు. కాకినాడ నగరంలో మూడు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన స్టాళ్లలో భారీ డిస్కౌంట్లు ప్రకటిస్తున్నారు.

## నేటి రాత్రికి నిబంధనలు ఇవీ..

కాకినాడ క్రైం: నూతన సంవత్సర వేడుకల్లో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టంగా వ్యవహరిస్తోంది. సుహృద్భావ వాతావరణంలో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించే లక్ష్యంతో పలు నిబంధనలు ప్రకటించింది. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ శనివారం రాత్రి ఓ ప్రకటన విడుదల చేశారు. 31వ తేదీ అర్ధరాత్రి 12.30 వరకు మాత్రమే వేడుకలకు అనుమతి ఇచ్చారు. ప్రజాశాంతికి భంగం కలగకుండా వ్యవహరించాలని యువతను కోరారు. భారీ శబ్దం చేసే సైలెన్సర్లు, బాకాలు, ఇతర సాధనాలతో శబ్దాలు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈవెంట్లు నిర్వహించుకునే వారు తప్పకుండా డీఎస్పీ కార్యాలయం నుంచి అనుమతి పొంది తప్పకుండా సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. జన సమ్మర్థ ప్రాంతాల్లో వేడుకలకు అనుమతి లేదన్నారు. అతి వేగం, మద్యం మత్తులో వాహనాలు నడిపితే అరెస్టులు తప్పవని హెచ్చరించారు. డీజే సౌండ్ బాక్సులు, బాణసంచా పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. మహిళల గౌరవానికి భంగం కలిగేలా ప్రవర్తించినా, ఇళ్ల వద్ద ముగ్గులు పెట్టే మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించినా కఠిన చర్యలు చేపడతామన్నారు. సభలు, సమావేశాలకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. గుంపులుగా రోడ్లపై సంచరిస్తూ ఆకతాయి వ్యవహారాలు ప్రదర్శించే వారి ఆటకట్టించేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు బనాయిస్తామని హెచ్చరించారు. మైనర్లకు మద్యం విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకుని వ్యాపార అనుమతులు రద్దు చేస్తామన్నారు. బార్‌లు, మద్యం దుకాణాలు తప్పకుండా ప్రభుత్వ అనుమతితోనే నడవాలని సూచించారు. కోవిడ్ తన ఉనికిని చాటుకుంటున్న నేపథ్యంలో క్రమశిక్షణతో వ్యవహరించాలని అన్నారు.

# విద్యార్థులకు ఆనంద నిలయం

- వసతి గృహం విద్యార్థులకు మెరుగైన వసతులు
- రూ.15 లక్షల సీఎస్సార్ నిధులతో నూతన బ్లాక్
- ప్రారంభించిన కలెక్టర్ కృతికా శుక్లా



ఆనంద నిలయం వసతి గృహంలో నూతనంగా నిర్మించిన బ్లాక్‌ను ప్రారంభించిన కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఆనంద నిలయం వసతి గృహంలోని విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో రూ.15 లక్షల సీఎస్సార్ నిధులతో అదనపు వసతి గదులు నిర్మించినట్టు కలెక్టర్ కృతికా శుక్లా అన్నారు. శనివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాల దగ్గర ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ బాలుర ఆనంద నిలయంలో కాకినాడ కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్మించిన బ్లాక్‌ను జిల్లా సాంఘిక సంక్షేమశాఖ, కోరమాండల్ అధికారులతో కలిసి ఆమె ప్రారంభించారు. వసతి గృహంలో విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి పరుపులు, ఇతర సామగ్రిని అందజేసి, పిల్లలందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఆనంద నిలయం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్టు తెలిపారు. ఇప్పటికే ఆనంద నిలయం విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఆర్‌వో ఫిల్టర్, వాషింగ్ మెషీన్, టీవీ, ఇతర చిన్న చిన్న వసతులు కల్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జేడీ డీవీ రమణమూర్తి, సీపీవో పి.త్రినాథ్, కోరమాండల్ ఇంటర్నేషనల్ కాకినాడ యూనిట్ అధికారి సీహెచ్ శ్రీనివాసరావు, ఇతర సాంఘిక సంక్షేమశాఖ సిబ్బంది, ఆనంద నిలయం వసతి గృహం సిబ్బంది పాల్గొన్నారు.

## బ్రహ్మకుమారీలకు ఘన సన్మానం



సర్పవరంలో సత్కారం అందుకుంటున్న బ్రహ్మకుమారిలు

కాకినాడ రూరల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల బ్రహ్మకుమారీస్ శాఖల ఇన్‌చార్జి రజనీ దీదీ 62వ జన్మదినాన్ని పురస్కరించుకుని బ్రహ్మకుమారీలకు శనివారం ఘనంగా సన్మానం నిర్వహించారు. సర్పవరంలోని డీజీబీ కల్యాణ మండపంలో ఆమె జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 25 ఏళ్లుగా బ్రహ్మకుమారీల ఆశ్రమంలో భాగస్తులుగా ఈశ్వరుని సాన్నిధ్యంలో తమ జీవితాన్ని గడుతున్న 108 మంది బ్రహ్మకుమారీలతో పాటు 50 వసంతాలు పూర్తి చేసుకుని ఈశ్వరునికి జీవితాన్ని అర్పించిన మరో ఏడుగురిని సన్మానించారు. కార్యక్రమంలో విజయనగర బ్రహ్మకుమారీస్ శాఖల ఇన్‌చార్జి బీకే అన్నపూర్ణ, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రజనీ దీదీ, అన్నపూర్ణలు బ్రహ్మకుమారీలను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు.

## ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు



కరపలో క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న హెచ్ఎం, పీడీలు



కరప హైస్కూలు గ్రౌండ్‌లో క్రికెట్ పోటీకి ముందు టాస్ వేస్తున్న అధికారులు

కరప: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలు కరప మండలంలో 5వ రోజు శనివారం జోరుగా, ఉషారుగా సాగాయి. కరప, అరట్లకట్ట, నడకుదురు, గురజనాపల్లి, వేములవాడ, వేళంగి, పెద్దాపురప్పాడు గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాల్లో క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, ఖోఖో మ్యాచ్‌లు జరిగాయి. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రికెట్, వాలీబాల్ పోటీలను హెచ్ఎం యు.లీలామనోహర్, పీడీ కె.శ్రీనివాస్ ప్రారంభించి, క్రీడాకారులకు క్రీడా కిట్లు అందజేశారు. ఎంపీడీఓ కె.అప్పారావు ఆయా గ్రామాల్లో పర్యటించి, ఆటలపోటీలను పరిశీలించి, సూచనలిచ్చారు. 5వ రోజు 24 మ్యాచ్‌లు జరగగా ఖోఖోలో–5, క్రికెట్‌లో–9, వాలీబాల్‌లో–4, కబడ్డీలో–6 మ్యాచ్‌లు జరిగాయన్నారు. ఆయా పాఠశాలల్లో పీడీలు ఆటల పోటీలను నిర్వహించారన్నారు.

## పరీక్షలపై భయం వీడితే సత్ఫలితాలు

- విద్యార్థులకు కలెక్టర్ కృతికా శుక్లా హితవు
- వి లవ్ ఎగ్జామ్స్ కార్యక్రమం ప్రారంభం



వి లవ్ ఎగ్జామ్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: విద్యార్థులలో పరీక్షలపై భయాన్ని పారదోలేందుకు మనమంతా కృషి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా పిలుపునిచ్చారు. ది షైన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన వి లవ్ ఎగ్జామ్స్ అనే కార్యక్రమాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయం నుంచి ఆమె ప్రారంభించారు. ది షైన్ నిర్వాహకుడు సాయి ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించే ఉద్దేశ్యంతో తమ బృందం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పరీక్షల సమయం సమీపిస్తున్నందున విద్యాలయాలలో ఈ క్యాంపెయిన్ నిర్వహించి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. క్యాంపెయిన్ నిర్వహణకు అనుమతి ఇచ్చినందుకు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో షైన్ సభ్యులు ధృవీణ, స్రవంతి, జాఫర్, అప్పలరాజు, దీప్తి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

### రైల్వే స్టేషన్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్



డీఆర్ఎం నుంచి సర్టిఫికెట్ అందుకున్న ఎస్ఎం రమేష్

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌కు ఐఎస్ఓ సర్టిఫికెట్ వచ్చిందని రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తెలిపారు. శుక్రవారం విజయవాడలో రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ రైల్వే స్టేషన్ ఉత్తమ నిర్వహణకు సంబంధించి ఐఎస్ఓ సర్టిఫికెట్ అందజేశారని ఆయన శనివారం తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ స్టేషన్‌లో స్వచ్ఛమైన తాగునీరు అందించడంతో పాటు ప్లాట్‌ఫారాలు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండటం, టిక్కెట్ల విధానం సక్రమంగా జరగడం, ప్రయాణికులకు నాణ్యత కలిగిన ఆహార పదార్థాలు అందించడంతో ఈ సర్టిఫికెట్ వచ్చిందన్నారు. స్టేషన్‌లో పని చేస్తున్న వివిధ శాఖల అధికారుల సహకారంలో ఇది సాధ్యమైందన్నారు.

**నేడు సామర్లకోటకు అమృత్ భారత్**

రైల్వే శాఖ కొత్తగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ట్రయిల్ రన్‌లో భాగంగా ఆదివారం సాయంత్రం సామర్లకోటకు వస్తుందని స్టేషన్ మేనేజర్ రమేష్ తెలిపారు. విజయవాడ డివిజనల్‌లో తుని, సామర్లకోట, రాజమహేంద్రవరం, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు స్టేషన్‌లలో ఆగుతుందని చెప్పారు. 22 బోగీలతో ఉండే ఈ రైలులో 12 నాన్ ఏసీ బోగీలు, 8 సాధారణ బోగీలు ఉంటాయన్నారు.

## ఆకట్టుకున్న మ్యాజిక్ చదరం

| | | | |
|---|---|---|---|
| 533 | 486 | 479 | 526 |
| 478 | 527 | 532 | 487 |
| 528 | 481 | 484 | 531 |
| 485 | 530 | 529 | 480 |

2024కు స్వాగతం పలుకుతూ మ్యాజిక్ చదరం



తోటకూర సాయిరామకృష్ణ

సామర్లకోట: నూతన సంవత్సరం 2024కు స్వాగతం పలుకుతూ గణితావధాని, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ తయారు చేసిన మ్యాజిక్ చదరం అందరినీ ఆకర్షించింది. మ్యాజిక్ చదరంలో ఏ అడ్డు వరసలు, కర్ణముల నాలుగు అంకెలు కూడినా 2024 వస్తుందని సాయిరామకృష్ణ తెలిపారు. ఈ చదరాన్ని అన్ని వేర్వేరు సంఖ్యలతో తయారు చేశానన్నారు.